
సాక్షి
కాకినాడ
గురువారం । 28 । నవంబర్ । 2024



నదీ గర్భంలో ఇసుక దోపిడీ

బోడసకుర్రు - పాశర్లపూడి గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న రైల్వే లైన్ వంతెన ఆనుకుని వైనతేయ నదీ గర్భంలో సహజ సిద్ధంగా ఏర్పడిన ఇసుకను అక్రమార్కులు యథేచ్ఛగా తవ్వేస్తున్నారు.




ఇక సమరమే..

8లో

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎస్‌జీఎఫ్‌ఏపీ) ఆధ్వర్యంలో అండర్ -14 బాలుర క్రికెట్ పోటీలు గురువారం నుంచి మొదలు కానున్నాయి.

17 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రం 17,382 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. గోదావరి డెల్టా కాలువలకు 3,700 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

నేటి నుంచి నృత్య, నాటకోత్సవాలు

బోట్‌క్లబ్: సరస్వతీ గానసభ 121వ వార్షిక సంగీత, నృత్య నాటకోత్సవాలు గురువారం నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకూ జరుగుతాయని ప్రముఖ గాయనీ పెద్దాడ సూర్యకుమారి బుధవారం విలేకర్లకు తెలిపారు. ఈ నెల 28న సాయంత్రం 6.30 గంటలకు చెన్నైకు చెందిన కృష్ణమోహన్, శ్రీరామ్‌కుమార్‌మోహన్ గాత్ర కచేరీ జరుగుతుందన్నారు. ఈ 29న సాయంత్రం 6.30 గంటలకు చోడే అనిల్‌కుమార్ సౌజన్యంతో విజయనగరం విజయ సూర్య ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కన్యాశుల్కం నాటకం ప్రదర్శిస్తారన్నారు. ఈ నాటకంలో అందరూ మహిళా పాత్రధారులే ఉంటారన్నారు. ఈ నెల 30న సాయంత్రం చెన్నైకు చెందిన ఓఎస్ అరుణ్ గాత్ర కచేరీ, డిసెంబర్ ఒకటో తేదీ సాయంత్రం 6. 30 గంటలకు విశాఖపట్నంకు చెందిన కుమారి ఆర్.లక్ష్మీకృష్ణప్రియ గాత్ర కచేరీ ఉంటాయన్నారు.

బాల్య వివాహాలను నిరోధించాలి



పిఠాపురం -ఉప్పాడ రోడ్డులో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కొత్తపల్లి: మండలంలో బాల్య వివాహాల నిరోధక కమిటీలు సమర్థంగా పని చేయాలని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ప్రవీణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కిశోర్ వికాసం, బాల్య వివాహల నిరోధక చట్టంపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండల స్థాయి శిక్షణ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. ఆమె మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బంది, కమిటీలు 18 సంవత్సరాల బాల బాలికలు చదువుకునేలా చూడాలన్నారు. జిల్లా హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో రవికుమార్, తహసీల్దార్ చిన్నారావు, సీడీపీఓ దుర్గాదేవి, వైద్య, పంచాయతీ, రెవెన్యూ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ఉత్తీర్ణత పెంచేందుకు కార్యాచరణ

అమలాపురం టౌన్: ఇంటర్మీడియెట్ విద్యార్థుల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచేందుకు బోర్డు కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందని జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి (డీఐఈవో) వనుము సోమశేఖరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న స్టడీ అవర్ల సమయాన్ని పెంచడం, ఆర్టీసీ అధికారులతో మాట్లాడి మారుమూల ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించడం వంటి చర్యలు తీసుకుందన్నారు. విద్యార్థులు ఏ విషయంలోనైనా అసౌకర్యానికి గురైతే వారి తల్లిదండ్రులు ఆ సమస్యను నేరుగా సంబంధిత కళాశాల ప్రిన్సిపాళ్లకు తెలియజేయవచ్చన్నారు.

మబ్బులతో రైతులకు గుబులు

- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- దిగుబడి తగ్గుతుందని ఆవేదన



కరప మండలం వాకాడలో కోసిన పంటను గట్టుకు చేర్చేందుకు కట్టుకుంటున్న కూలీలు

కరప: అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడతాయని హెచ్చరికలు చేస్తుండటంతో ఖరీఫ్ పంట ఏమవుతుందోనని రైతుల్లో గుబులు రేపుతోంది. ఆకాశంలో మబ్బులు పట్టి మంగళ, బుధవారాల్లో ఈదురు గాలులు వీస్తుండటంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా, వాటన్నింటినీ తట్టుకుని, పెట్టుబడులు పెరిగినా భరించామని, పంట కోతకు రావడంతో పంటను దక్కించుకుందామంటే తుపాను వచ్చిపడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో కోతలు ముమ్మరంగా సాగుతున్నాయని, ఈ సమయంలో వర్షాలు పడితే చేతికొచ్చిన పంట నీటిపాలవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ జిల్లాలో సుమారు 2.13 లక్షల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ముదరగా ఊడ్చిన పొలాలు కోతకు రావడంతో మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. దీపావళి అమావాస్యకు చినుకులు పడకపోవడంతో ఆనందపడి, కోతలు చేపట్టిన రైతులకు అల్పపీడనం వెన్నులో వణుకు పుట్టిస్తోంది. వారంరోజులుగా మబ్బులు లేకుండా వాతావరణం అనుకూలంగా ఉండటంతో కోతలు చేపట్టామని రైతులు అంటున్నారు. లేతగా ఊడ్చిన పొలాల్లో పంట పక్వ దశకు చేరుకుంది. ఈ ఏడాది ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులు, చివరిలో అక్టోబర్, నవంబర్ నెలల్లో వరుస తుపాన్లు, వర్షాలతో పంట దెబ్బతిందని రైతులు అంటున్నారు. దిగుబడులు అంతంతమాత్రంగా ఉన్నాయని ఆందోళన చెందుతుంటే గోరుచుట్టుపై రోకటిపోటు చందాన అల్పపీడనం మరింత దెబ్బతీస్తోందని రైతులు అంటున్నారు. ఈదురు గాలులకు కంకుల నుంచి ధాన్యం రాలిపోతుందని, కోసిన చేలు పనమీద, నేలనంటి ఉన్న వరిచేలు వర్షాలుపడితే పనిచేయకుండా పోతాయని రైతులు వాపోతున్నారు.

పెరిగిన కూలి రేట్లు

ఆకాశంలో మబ్బులుపట్టి, వాతావరణం మారడంతో కూలీ రేట్లు కూడా పెరిగిపోయాయని, మగవారికి రూ.900 ఉండే కూలీ రూ.1,200, మహిళలకు రూ.400 నుంచి రూ.600కు పెంచేశారని, అయినా మనుషులు దొరకడంలేదని రైతులు తెలిపారు. కోసిన చేలను హడావుడిగా కుప్పలు వేసుకునే, నూర్పిళ్ల పనిలో రైతులు నిమగ్నమయ్యారు. నూర్పిడి చేసిన ధాన్యాన్ని లేఅవుట్లలోకి తీసుకొచ్చి, రాశులు చేసి, తడిసిపోకుండా బరకాలతో కప్పి ఉంచుకుంటున్నారు. ఈ ఏడాది పెట్టుబడులు రాకపోయినా పశుగ్రాసమైనా దక్కుతుందనుకుంటే, తుపాను కారణంగా వర్షాలు పడితే అదీకూడా కుళ్లిపోతుందని కరపకు చెందిన రైతులు వెలుగు బంట్ల రవినాయుడు, బండే వీరబాబు తెలిపారు.



వలసపాకల లేఅవుట్‌లో బరకాలతో కప్పిన ధాన్యం రాశులు



కరపలో గాలులకు నేలనంటిన వరి పంట

రేషన్ బియ్యం విదేశాలకు పోకుండా నిఘా

కలెక్టర్ షణ్మోహన్ సగిలి

కాకినాడ సిటీ: కాకినాడ యాంకరేజ్ పోర్టు ద్వారా పీడీఎస్ బియ్యం అక్రమంగా విదేశాలకు తరలిపోకుండా నిరోధించేందుకు పటిష్టమైన నిఘా, నిశితమైన తనిఖీ వ్యవస్థలను ఏర్పాటు చేశామని కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి విదేశాలకు పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో బుధవారం యాంకరేజి పోర్టులో స్టెలా ఎల్ నౌకలో లోడింగ్ జరుగుతున్న బియ్యాన్ని కలెక్టర్ షణ్మోహన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన రెవెన్యూ, మెరైన, పోలీస్, టెక్నికల్ అధికారులు, పోర్టు సిబ్బందితో కలిసి తీరంలోని రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం కార్యాలయం నుంచి సముద్రంలో లంగరు వేసిన ఈ షిప్పు వద్దకు చేరుకుని తనిఖీలు చేశారు. నౌకలో అప్పటికే లోడ్ చేసిన బియ్యం నమూనాలను సేకరించి, సిబ్బందిని లోడ్ చేస్తున్న బియ్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన యాంకరేజ్ పోర్టుకు చేరుకుని తనిఖీ వివరాలను మీడియా ప్రతినిధులకు తెలియజేశారు. కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి విదేశాలకు అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్నారనే సమాచారంలో రెవెన్యూ, మెరైన్ పోలీస్, టెక్నికల్ అధికారులు, పోర్టు సిబ్బంది కలిసి సముద్రంలో బియ్యం లోడింగ్ జరుగుతున్న స్టెలా ఎల్ షిప్పును ఆకస్మికంగా తనిఖీ చేసి నమూనాలను సేకరించామన్నారు. నౌకలోని 5 హేచస్‌లో 52 వేల టన్నుల లోడింగ్ సామర్థ్యం ఉండగా 38 వేల టన్నులు అప్పటికే లోడింగ్ జరిగిందన్నారు. దీనిలో బాయిల్డ్ రైస్‌తో పాటు 640 టన్నుల బియ్యం కూడా గతంలో ప్రభుత్వం సీజ్ చేసి బ్యాంక్ గ్యారంటీలు తీసుకుని రిలీజ్ చేసిన స్టాక్‌గా గుర్తించినట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. తనిఖీలో కలెక్టర్ వెంట కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, పోర్టు సీఐ పి.సునీల్‌కుమార్, ఏపీ ఎస్పీఎఫ్ అధికారి ఓ శ్రీధర్, పోర్టు కన్జర్వేటర్ వీరబాబు, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.



నౌకలో బియ్యం వివరాలను సేకరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

దోషరహితంగా ఓటరు జాబితా

కాకినాడ సిటీ: ఓటరు జాబితాను దోషరహితంగా రూపొందించడంలో అధికారులు దృష్టి సారించాలని రాష్ట్ర మైన్స్ అండ్ జువాలజీ శాఖ కమిషనర్, డైరెక్టర్, కాకినాడ జిల్లా ఎలక్ట్రోల్ రోల్ అబ్జర్వర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్ సగిలితో కలిసి ఎస్ఎస్ఆర్-2025 ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై ఈఆర్వోలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, నోడల్ అధికారులతో ఆయన సమీక్షించారు. పకడ్బందీగా ఓటర్ల జాబితా స్క్రూటినీ చేయాలన్నారు. ఓటు నమోదు, సవరణకు అర్హులైనవారు ఫారం-6, 7, 8 దరఖాస్తులను అందజేయాలన్నారు. కలెక్టర్ షణ్మోహన్ జిల్లాలో 2025 ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయా అంశాలను ఎలక్ట్రోల్ రోల్ అబ్జర్వర్ ప్రవీణ్ కుమార్‌కు వివరించారు. అక్టోబర్ 29 నాటికి 16,35,030 మంది ఓటర్లు నమోదయ్యారని, 8,04,886 మంది పురుషులు, 8,30,052 మంది మహిళలు, 190 మంది ఇతరులు ఉన్నారని తెలిపారు. జిల్లాలో 1,640 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని చెప్పారు. ఈ నెల 9, 10, 23, 24 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. డిసెంబర్ 24 నాటికి క్లెయిమ్‌లను అభ్యంతరాలను పరిష్కరిస్తామన్నారు. తుది జాబితాను 2025 జనవరి 6న ప్రచురిస్తామన్నారు. కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావన, డీఆర్వో జె. వెంకటరావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్.మల్లిబాబు, కె శ్రీరమణి, వివిధ నియోజకవర్గాల ఈఆర్వోలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎలక్ట్రోల్ రోల్ అబ్జర్వర్ ప్రవీణ్ కుమార్

రేషన్ షాపులకు సకాలంలో స్టాకు



వేళంగి ఎంఎల్ఎస్ కేంద్రంలో స్టాకును పరిశీలిస్తున్న జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రసాద్

కరప: ఎంఎల్ఎస్ కేంద్రం నుంచి రేషన్‌షాపులకు సరకులను సకాలంలో పంపించాలని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి ఎంపీఎస్ ప్రసాద్ సూచించారు. మండలంలోని వేళంగిలోని ఎంఎల్ఎస్ (మండల లెవెల్ స్టాక్) కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించి టెక్నికల్ అసిస్టెంట్ సౌందర్యను స్టాక్ వివరాలు అడిగి తెలుసుకుని, సూచనలిచ్చారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేళంగి ఎంఎల్ఎస్ కేంద్రం నుంచి కరప, కాజులూరు, పెదపూడి మండలాల రేషన్ షాపులకు బియ్యం, పంచదార, కందిపప్పు పంపిస్తామన్నారు. డిసెంబర్ నెల కోటా సరకులు పంపిస్తున్నామన్నారు. కరప మండలంలో 46 రేషన్ షాపులుండగా ఆరింటికి, కాజులూరు మండలంలో ఆరు షాపులకు స్టాక్ పంపించాల్సి ఉందన్నారు. పెదపూడి మండలానికి పూర్తిగా స్టాక్ పంపించామన్నారు. కొరిపల్లిలోని సివిల్ సప్లైస్ గోదాంలలోని స్టాక్ నాణ్యత పరిశీలన జరుగుతుండటంతో స్టాక్ రావడం ఆలస్యమైందని, రెండురోజుల్లో పూర్తి స్థాయిలో అన్ని మండలాలకు స్టాకు సరఫరా చేస్తామన్నారు. తర్వాత పెనుగుదురు రైతుసేవా కేంద్రంలో ధాన్యం సేకరణ ఎలా జరుగుతున్నదీ పరిశీలించారు. కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి, తుపాన్ హెచ్చరికలు వస్తున్న నేపథ్యంలో తడిసిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రత్నగిరి.. భక్తజన ఝురి

- సత్యదేవుని దర్శించిన 50 వేల మంది
- నాలుగు వేల వ్రతాల నిర్వహణ
- రూ.50 లక్షల ఆదాయం



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: కార్తిక బహుళ ద్వాదశి, బుధవారం రత్నగిరి సత్యదేవుని సన్నిధి వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో సందడిగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం ప్రాంగణం భక్త జనసందోహంతో నిండిపోయింది. సుమారు 50 వేల మంది సత్యదేవుని దర్శించారు. సత్యదేవుని వ్రతాలు నాలుగు వేలు నిర్వహించారు. జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.50 లక్షల ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు. సత్యదేవుని దర్శించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు వస్తారని ఊహించిన అధికారులు స్వామివారి ఆలయాన్ని బుధవారం తెల్లవారుజామున మూడు గంటలకు తెరిచి పూజలు చేశారు. స్వామివారి వ్రతాలు కూడా మూడు గంటల నుంచి ప్రారంభించారు. అనంతరం భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. అప్పటి నుంచి సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది. స్వామివారి వ్రత మండపాలు, నిత్య కల్యాణ మండపం, పాత కల్యాణ మండపాలు వ్రతాలాచరించే భక్తులతో నిండిపోయాయి. స్వామివారిని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. తూర్పు రాజగోపురం ఎదురుగా గల రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు.

ఈఓగా త్రినాథరావు బాధ్యతల స్వీకరణ



వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి (ఇన్‌చార్జి)గా వి.త్రినాథరావు బుధవారం ఉదయం 9-30 గంటలకు బాధ్యతలు స్వీకరించారు. సింహాచలం దేవస్థానానికి ఈఓగా పనిచేస్తున్న ఆయనకు అన్నవరం దేవస్థానం ఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించిన విషయం విదితమే. సత్యదేవుని ఆశీస్సులతో ఇక్కడ ఈఓగా నియమితులవ్వడం ఇది మూడోసారని, దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తానని త్రినాథరావు అన్నారు. భక్తుల సంఖ్య ఏటా పెరుగుతోంది. వీరికి సదుపాయాలు కల్పించడం కోసం నూతన సత్రాలు నిర్మించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు.

దిగులుబడి!

- కర్షకుల ఆశలపై ఖరీఫ్ నీళ్లు
- గణనీయంగా తగ్గిన వరి దిగుబడులు
- వాతావరణం, వర్షాల ప్రభావంతో పంటకు తీవ్ర నష్టం
- గతేడాది ఎకరానికి 35 నుంచి 40 బస్తాల వరకు..
- ప్రస్తుతం 25 నుంచి 30 బస్తాలు మించే పరిస్థితి లేదు
- తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 72,246 హెక్టార్లలో వరి సాగు
- 38,881 హెక్టార్లలో కోతలు పూర్తి
- పెట్టుబడులు సైతం దక్కే పరిస్థితి కనిపించని వైనం
- సాగుకు సాయం చేయని కూటమి ప్రభుత్వం
- ఆందోళన చెందుతున్న రైతులు



పెరవలిలో వరి కోతలు చేపడుతున్న యంత్రం

సాక్షి, రాజమహేంద్రవరం: కర్షకుల ఆశలపై ఖరీఫ్ నీళ్లు చల్లింది. పంట సాగు సమయంలో వాతావరణం అనుకూలించడంతో కోటి ఆశలతో వరి సాగు చేపట్టారు. తీరా పంట చేతికొచ్చే సమయంలో దిగుబడులు గణనీయంగా తగ్గడంతో పెట్టుబడులు సైతం అందుతాయా? లేదా..? అన్న మీమాంస కర్షకుల్లో నెలకొంది. గతేడాదితో పోలిస్తే.. ప్రస్తుతం పరిస్థితి మరింత దయనీయంగా మారిందని ఆందోళన చెందుతున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో ఎకరానికి 35 నుంచి 40 బస్తాల ధాన్యం దిగుబడి అందితే.. ఈ ఏడాది మాత్రం 30 బస్తాలు దాటే పరిస్థితి కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ పరిణామం రైతుల్లో ఆందోళన నింపుతోంది. పంట సాగుకు పెట్టిన పెట్టుబడులు సైతం అందుతాయా..? లేదా..? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

ప్రకృతి విపత్తులతో..

వరి సాగు ప్రారంభంలో వాతావరణం రైతులకు అనుకూలించింది. ఉత్సాహంగా కాడి పట్టారు. జోరుగా పంటల సాగు చేపట్టారు. పంట దిగుబడిపై గంపెడాశలు పెట్టుకున్నారు. చిరుపొట్ట దశలో కురిసిన భారీ వర్షాలు రైతులకు కన్నీళ్లు మిగిల్చాయి. వర్షాల ప్రభావంతో పూత రాలిపోవడం, తాలు గింజలు, మానుపళ్లు ఎక్కువగా రావడం శాపంగా మారింది. వరి పైరు ఈనిక దశలో కురిసిన అధిక వర్షాలకు పూత రాలిపోయింది. కొంత మేర తెగుళ్లు వ్యాప్తి చెందాయి. గింజ గట్టిపడే సమయంలో అధిక ఉష్ణోగ్రతల వల్ల ధాన్యపు గింజలు నొక్కుకుపోయాయి. ఈ పరిణామాలు దిగుబడిపై ప్రభావం చూపాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఎకరానికి 30 బస్తాలకు మించి దిగుబడి అందడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనికితోడు వరి కోత దశలో సైతం వాతావరణం అనుకూలించకపోవడం మరింత ఆందోళనకు గురి చేసింది. వరి కోతలు మొదలైన సమయం నుంచి తుపాను, అల్పపీడనం, వర్షం అంటూ వాతావరణ హెచ్చరికలు వెలువడుతున్నాయి. మళ్లీ ప్రకృతి ప్రకోపానికి ధాన్యం నీటిపాలు అవుతుందేమో అన్న కంగారులో రైతులు తక్కువ ధరకే ధాన్యం దళారులకు అమ్మేస్తున్నారు.

చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం

రైతులను ఆదుకునే విషయంలో కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. వర్షం హెచ్చరికల నేపథ్యంలో రైతులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం కనీసం వాళ్ల బాధలను పట్టించుకున్న పాపాన పోలేదు. నామ్‌కేవాస్తే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిందే తప్ప.. ధాన్యం కొనుగోళ్లపై దృష్టి సారించలేదు. వెరసి తామెక్కడ నష్టపోతామో అన్న భయాందోళనతో రైతులు దళారులకు తక్కువ ధరకే విక్రయించేస్తున్నారు. బస్తాకు రూ.1,725 అందాల్సి ఉన్నా.. రూ.100 నుంచి రూ.200 వరకూ తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతు నష్టపోకుండా.. ప్రతి గింజా ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేసింది.

పెరిగిన కోత ఖర్చులు

వరి కోత ఖర్చులు గణనీయంగా పెరిగిపోయాయి. యంత్రాలతో కోతలు, ట్రాక్టర్లతో రవాణా తదితర ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. గతంలో వరి కోత యంత్రానికి గంటకు రూ.2,600 నుంచి రూ.2,800 తీసుకునే వారు. ప్రస్తుతం రూ.2,800 నుంచి రూ.3,000 తీసుకుంటున్నారు. ట్రాక్టర్ అద్దె రూ.700 నుంచి రూ.1,000కి పెరగడంతో పెట్టిన పెట్టుబడులు అందుతాయా? లేదా? అన్న ఆందోళన రైతుల్లో నెలకొంది.

ధాన్యం దిగుబడులు ఇలా..

తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 72,246 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. ఇప్పటి వరకు 38,818 హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయి. 53.8 శాతం కోతలు ముగిసినా.. దిగుబడి మాత్రం 30 బస్తాల లోపే నమోదైంది. కడియం మండలంలో గతంలో 40 బస్తాల దిగుబడి రాగా.. ప్రస్తుతం 30 బస్తాలకే పరిమితమైంది. నిడదవోలు, పెరవలి, కొవ్వూరు మండలాల్లో సైతం 32 బస్తాలుగా నమోదైంది. మెరక భూముల్లో ఎకరానికి 30 నుంచి 35 బస్తాలు, పల్లపు పొలాల్లో 25 నుంచి 30 బస్తాల దిగుబడి వచ్చినట్టు రైతులు చెబుతున్నారు.

- కోనసీమ జిల్లాలో 61,943 హెక్టార్లలో వరి సాగైంది. గతేడాది ఖరీఫ్‌లో 35 బస్తాల దిగుబడి వచ్చింది. ప్రస్తుతం 32 బస్తాలు దిగుబడి నమోదవుతోంది.
- కాకినాడ జిల్లాలో 2.13 లక్షల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. గతేడాది ఎకరానికి 40 బస్తాల ధాన్యం దిగుబడి అందింది. ప్రస్తుతం ఎకరానికి 30 బస్తాల దిగుబడి అందుతోంది. గతేడాదికి ప్రస్తుతానికి 10 బస్తాలు తగ్గుముఖం పట్టింది.

గత ఐదేళ్లూ స్వర్ణయుగం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు స్వర్ణయుగం అని చెప్పుకోవాలి. పంట సాగుకు ముందే రైతు భరోసా పేరుతో రూ.13,500 పెట్టుబడి సాయం అందజేయడంతో ఎలాంటి అప్పులు లేకుండా పంట సాగు చేపట్టారు. సాగుకు అనువైన సమయంలో నీరు విడుదల చేయడంతో గణనీయమైన దిగుబడులు వచ్చాయి. తూర్పుగోదావరి జిల్లాలో 2021 ఖరీఫ్‌లో 82,695 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. ఎకరానికి (75 కిలోల బస్తా) 28 బస్తాల ధాన్యం దిగుబడి వస్తే.. 2022 ఖరీఫ్‌లో 73,606 హెక్టార్లలో వరి సాగైంది. ఎకరానికి 33 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. 2023లో 73,000 హెక్టార్లలో సాగైతే 40 బస్తాల దిగుబడి వచ్చింది. అంటే ఏడాది వ్యవధిలో ఎకరం పొలానికి 5 నుంచి 10 బస్తాలు వృద్ధి చెందింది.

మాజీ ముఖ్యమంత్రి చొరవతో..

ఏటా మూడు పంటల సాగును ప్రోత్సహించాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. అందుకు అనుగుణంగా 2022 ఖరీఫ్‌లో జూన్ 1వ తేదీ నుంచి ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేశారు. సాధారణంగా జూన్ 11న విడుదల చేయాల్సి ఉండగా.. పది రోజుల ముందుగా సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ నుంచి నీటి విడుదలకు చర్యలు తీసుకున్నారు. ఫలితంగా ప్రకృత్తి విపత్తులు, గోదావరి వరద నుంచి పంటను గట్టెక్కించుకునే అవకాశం కలిగింది. ప్రస్తుతం అలాంటి చర్యలు కనిపించడం లేదు.

దిగుబడి బాగా తగ్గింది



గత ఖరీఫ్ సీజన్‌తో పోలిస్తే ప్రస్తుతం ధాన్యం దిగుబడులు బాగా తగ్గాయి. వాతావరణం, వర్షాల కారణంగా భారీగా నష్టపోయాం. ఎకరానికి 30 బస్తాలకు మించి దిగుబడులు అందడం లేదు. పంటల సాగుకు ఖర్చు బాగా పెరిగింది. పెట్టుబడులు సైతం అందే పరిస్థితి కనిపించడం లేదు.

– కోటిపల్లి రాంబాబు, రైతు, అన్నవరప్పాడు

జిల్లాలో వరి కోతలు ఈ నెల 25నాటికి ఇలా..

మండలం	వరి సాగు (హెక్టార్లలో)	పూర్తయిన కోతలు (హెక్టార్లలో)	మండలం	వరి సాగు (హెక్టార్లలో)	పూర్తయిన కోతలు (హెక్టార్లలో)
రాజమండ్రి రూరల్	1,401	1,158	చాగల్లు	3,284	3,021
కడియం	2,015	1,250	దేవరపల్లి	3,365	1,560
రాజానగరం	4,128	3,400	గోపాలపురం	4,012	840
అనపర్తి	3,623	3,500	కొవ్వూరు	4,444	3,857
బిక్కవోలు	5,696	5,305	నిడదవోలు	6,935	3,851
కోరుకొండ	5,199	840	పెరవలి	3,240	1,620
గోకవరం	5,389	1,284	తాళ్లపూడి	3,689	1,674
సీతానగరం	5,208	730	ఉండ్రాజవరం	4,703	2,607
రంగంపేట	2,433	1,170	నల్లజర్ల	3,472	1,214

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో డిగ్రీ విద్యార్థిని మృతి


రూపాదేవి మృతదేహం

కడియం: జాతీయ రహదారిపై వేమగిరి జంక్షన్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వేమగిరి తోటకు చెందిన డిగ్రీ విద్యార్థిని పితాని రూపాదేవి (18) మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రూపాదేవి, ఆమెకు వరసకు మేనత్త అయ్యే కల్లా దుర్గ.. డిగ్రీ పరీక్ష రాసేందుకు స్కూటీపై రాజమహేంద్రవరం బయలుదేరారు. దుర్గ డ్రైవింగ్ చేస్తుండగా, రూపాదేవి వెనుక కూర్చుంది. వేమగిరి జంక్షన్ వద్ద రాజమహేంద్రవరం వైపునకు తిరుగుతుండగా వీరిని రావులపాలెం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపునకు వస్తున్న ఆదిత్య కాలేజీ బస్సు ఢీకొంది. దీంతో వీరిద్దరూ రోడ్డుపై పడిపోయారు. రూపాదేవిపై నుంచి బస్సు చక్రాలు వెళ్లిపోవడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. దుర్గకు కూడా గాయాలయ్యాయి. వీరిద్దరినీ రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి రూపాదేవి మృతి చెందిందని నిర్ధారించారు. కడియం ఎస్సై బి.నాగదుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. రూపాదేవి తండ్రి గతంలో చనిపోయారు. తల్లి హైదరాబాద్‌లో కూలి పనులకు వెళ్లింది. వేమగిరి తోటలోని అమ్మమ్మ వాళ్లింట్లో ఉంటూ రూపాదేవి డిగ్రీ, ఆమె అన్న అరవింద్ పాలిటెక్నిక్ చదువుతున్నారు.

పాముకాటుకు రైతు మృతి


ఆస్పత్రిలో మృతి చెందిన సత్యనారాయణ

సామర్లకోట: పొలంలో పని చేసుకుంటున్న రైతును పాము కాటు వేయడంతో మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన పైబి వీర వెంకట సత్యనారాయణ (58) రోజూ మాదిరిగానే పొలానికి వెళ్లాడు. అక్కడ పనిచేసుకుంటుండగా పాము కాటు వేసింది. సత్యనారాయణ కేకలు వేయడంతో సమీపంలోని రైతులు ఈ విషయాన్ని గమనించి హుటాహుటీన సామర్లకోట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యుల సమాచారం మేరకు పోలీసులు ఆస్పత్రికి చేరుకుని, సమాచారం సేకరించి కేసు నమోదు చేశారు.

ఇక సమరమే..

- నేటి నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు
- అండర్ – 14 బాలుర విభాగంలో నిర్వహణ
- అమలాపురం బాలుర ఉన్నత పాఠశాల సిద్ధం
- కోనసీమ జిల్లాలో తొలిసారి

సాక్షి, అమలాపురం: జిల్లా కేంద్రమైన అమలాపురంలో రాష్ట్ర స్థాయి క్రికెట్ సంగ్రామానికి తెరలేవనుంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎస్‌జీఎఫ్ ఏపీ) ఆధ్వర్యంలో అండర్ -14 బాలుర క్రికెట్ పోటీలు గురువారం నుంచి మొదలు కానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే పోటీలు అమలాపురం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో లాంఛనంగా ప్రారంభమవుతాయి. ఇక్కడే కాకుండా కిమ్స్ మెడికల్ కాలేజీ, జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో కూడా నిర్వహించనున్నారు. ఈ పోటీలకు 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన 210 మంది క్రీడాకారులు, 40 మంది వరకు అంపైర్లు, టెక్నికల్ సిబ్బంది రానున్నారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తారు. ఉత్తమ ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తారు.

ఇదే తొలిసారి

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరఫున కోనసీమ జిల్లాలో క్రికెట్ పోటీలు నిర్వహించడం ఇదే తొలిసారి. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న స్కూల్ గేమ్స్‌ను కొత్త జిల్లాల వారీగా విడదీయడంతో ఈ అవకాశం దక్కింది. క్రికెట్ క్రీడా పోటీలకు అనువుగా ఆయా క్రీడా మైదానాలను తీర్చిదిద్దారు. అమలాపురం బాలుర ఉన్నత పాఠశాలలో కొత్త వికెట్ నిర్మాణం చేశారు. గ్రౌండ్‌ను లెవిలింగ్ చేయడంతోపాటు ఇతర సౌకర్యాలు కల్పించారు. గతంతో పోలిస్తే ఇటీవల ఎస్‌జీఎఫ్ పోటీలకు నిధుల కేటాయింపు పెరిగింది. దీనితో పోటీలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. జిల్లాల విభజన తరువాత కొత్త జిల్లాల ప్రాతిపదికన కొన్ని పోటీలను, ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన మరికొన్ని పోటీలను నిర్వహిస్తున్నారు. స్థానికంగా కూడా అన్ని విధాలుగా ప్రోత్సాహం అందుతుండడంతో ఉమ్మడి జిల్లాలో ఈ పోటీలు విజయవంతంగా సాగుతున్నాయి.


అమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈవో సలీమ్ బాషా తదితరులు

మూడు మైదానాల్లో నిర్వహణ

అమలాపురం టౌన్: రాష్ట్ర స్థాయి అండర్ -14 క్రికెట్ టోర్నమెంట్‌ను అమలాపురంలోని మూడు క్రీడా మైదానాల్లో ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు కలెక్టర్, జిల్లా స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ అమలాపురంలోని జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాల క్రీడా మైదానం, బాలయోగి స్టేడియం, కిమ్స్ వైద్య కళాశాల క్రీడా మైదానాల్లో ఈ పోటీలు ఏక కాలంలో జరుగుతాయన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం రాత్రి ప్రకటన విడుదల చేశారు. దీనిలో విజేతలను జాతీయ స్థాయి బాలుర అండర్ -14 క్రికెట్ పోటీలకు రాష్ట్రం నుంచి పంపిస్తామని తెలిపారు.


అమలాపురం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన పిచ్

ఏర్పాట్ల పరిశీలన

టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్, డీఈవో షేక్ సలీమ్ బాషా బుధవారం సాయంత్రం మూడు క్రీడా మైదానాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. క్రీడాకారుల భోజనం, వసతి ఏర్పాట్లను పరిశీలించారు. బుధవారం నాటికే రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి దాదాపు వంద మంది క్రీడాకారులు బాలయోగి స్టేడియానికి చేరుకున్నారని తెలిపారు. ఆయన వెంట బాలురు ఉన్నత పాఠశాల క్రీడా స్థలం టోర్నమెంట్ ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రాజరాజేశ్వరి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట రవి, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఏవీ శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు మునలయ్య, ప్రసాద్, మూర్తి, రామారావు ఉన్నారు.

ఆనందంగా ఉంది



ఎస్‌జీఎఫ్ తరఫున జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు జరగడం ఇదే తొలిసారి. అవి కూడా మా పాఠశాలలో జరగడం ఆనందంగా ఉంది. పోటీలను విజయవంతం చేసేందుకు మైదానాన్ని ఆధునీకరించడంతో పాటు అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రజాప్రతినిధులు, అధికారులు, వ్యాయామోపాధ్యాయులు ఈ పోటీల నిర్వహణకు అన్నిరకాలుగా సహకరిస్తున్నారు.
– తోట రవి చంద్రమౌళి, ఆర్గనైజింగ్ కార్యదర్శి, పీడీ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల

ఒకే ఏడాది రెండు టోర్నమెంట్లు



కోనసీమ జిల్లా ఏర్పడిన తరువాత ఎస్‌జీఎఫ్ తరఫున ఒకే ఏడాది రెండు రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తున్నాం. ఇప్పటికే షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను మలికిపురంలో జరిపాం. ఇప్పుడు క్రికెట్ పోటీలను అమలాపురంలో జరగనున్నాయి. ఈ రెండు విభాగాలలో రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉంది.
– అడబాల విజయ శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి

12 అంగుళాల పుంగనూరు దూడ జననం


పుంగనూరు దూడతో రైతు సత్తిబాబు

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరు రైతు పశుపోషక అవార్డు గ్రహీత రెడ్డి సత్తిబాబు పశువుల మకాంలో బుధవారం పుంగనూరు పెయ్యి దూడ జన్మించింది. అయితే ఈ దూడ కేవలం 12 అంగుళాల ఎత్తులో ఉండటం విశేషం. సాధారణంగా పుంగనూరు దూడలు 15 నుంచి 18 అంగుళాల వరకూ ఉంటాయి.

30న సైక్లింగ్ క్రీడాకారుల ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): గుంటూరు జిల్లా మందడం గ్రామంలోని గుడ్‌రోల్ ఇంగ్లిషు మీడియం స్కూల్లో ఈ నెల 30న రాష్ట్రస్థాయి సైక్లింగ్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్ తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ ఈ పోటీలలో ఎంపికైన వారు డిసెంబరు 7 నుంచి 10 వరకు ఒడిశాలోని పూరిలో జరిగే జాతీయస్థాయి సైక్లింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. ఆసక్తి కలవారు తమ సొంత సైకిల్‌తో గుంటూరులో జరిగే ఎంపికలకు హాజరుకావాలని కోరారు.

హత్యకేసు మిస్టరీ వీడేదెప్పుడో..

- పుల్లలపాడు హత్యకు ఏడాది పూర్తి
- ముందుకు కదలని దర్యాప్తు


కాట్రగడ్డ ప్రభాకరరావు మృతదేహం (ఫైల్)

నల్లజర్ల: పుల్లలపాడులో సినీ పక్కిలో జరిగిన హత్యకు ఏడాది పూర్తయినా మిస్టరీ వీడలేదు. నిందితులు పిస్టల్‌తో ఈ ఘాతుకానికి పాల్పడడం అప్పట్లో సంచలనం రేపింది. వివరాల్లోకి వెళితే.. నల్లజర్ల మండలం పుల్లలపాడు గ్రామానికి చెందిన రైతు, డాక్యుమెంట్ రైటర్ కాట్రగడ్డ ప్రభాకరావు (64) గతేడాది నవంబరు 28 సాయంత్రం 6 గంటల సమయంలో హత్యకు గురయ్యారు. ఆయన ఇంటివద్దే గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు అతి సమీపం నుంచి పిస్టల్‌తో కాల్చిచంపారు. రెండు బుల్లెట్లు ఆయన ఛాతీలో దిగడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై అప్పటి డీఎస్పీ వర్మ, సీఐ నున్న రాజు ముమ్మరంగా దర్యాప్తు జరిపారు. దీనిలో భాగంగా ప్రత్యేక బృందాలను నియమించారు. కానీ కేసు విషయం ఇప్పటికీ మిస్టరీ మిగిలిపోయింది. పట్టణ ప్రాంతాలలో కనిపించే గన్ కల్చర్ పల్లె ప్రాంతాలకు విస్తరించిందనటానికి పుల్లలపాడు సంఘటనే అద్దం పడుతోంది. కాట్రగడ్డ స్వతహాగానే 20 ఎకరాల భూస్వామి. అలాగే భూదందాలు, సెటిల్‌మెంట్లు చేస్తుంటారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయనకు చాలామందితో తగాదాలు ఉన్నాయని చెబుతారు. అయితే టెక్నాలజీ ఇంతగా పెరిగినా ఇంకా హంతకులను పట్టుకోలేకపోవడం మిస్టరీగా మారింది. ఈ విషయమై నల్లజర్ల సీఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఆ కేసుపై ప్రత్యేక బృందం దర్యాప్తు జరుపుతోందన్నారు.

నదీ గర్భంలో ఇసుక దోపిడీ

- నాటు పడవలపై ఒడ్డుకు తరలింపు
- ట్రాక్టర్ ఇసుకకు రూ.4వేల నుంచి రూ. 6 వేలు వసూలు
- పట్టించుకోని రెవెన్యూ, పోలీసులు

అల్లవరం: బోడసకుర్రు – పాశర్లపూడి గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న రైల్వే లైన్ వంతెన ఆనుకుని వైనతేయ నదీ గర్భంలో సహజ సిద్ధంగా ఏర్పడిన ఇసుకను అక్రమార్కులు యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. బోడసకుర్రు గ్రామానికి చెందిన కొందరు ఈ దందాకు పాల్పడుతున్నారు. స్థానికంగా ఉన్న మత్స్యకారుల ద్వారా బకెట్లుతో ఇసుకను తీసి పడవలోకి లోడ్ చేసి, గోపాయిలంక, గోడిలంక, రెబ్బనపల్లి, ఓడలరేవు, కరవాక గ్రామాలకు తరలిస్తున్నారు. ఈ గ్రామాల నుంచి ఇసుక ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా జరుగుతోంది. ట్రాక్టర్ ఇసుకకు రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకూ విక్రయిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు.


నదీ గర్భంలో తీసిన ఇసుకను పడవలపై తరలిస్తున్న దృశ్యం

యథేచ్ఛగా తరలింపు

నది నుంచి ఇసుక తీయడానికి కూలీలకు రూ.1300, పడవ యజమానికి రూ.600 ఇస్తున్నారు. మిగిలినదంతా ట్రాక్టర్ యజమాని, మధ్యవర్తులు దోచుకుంటున్నారు. ఇసుక తీయడానికి కూలీలతో వెళ్లిన పడవపై ఇసుకను అన్‌లోడ్ చేసి తిరిగి వచ్చేంత వరకు ఎక్కడికక్కడే నిఘా ఉంటుంది. కొత్త వ్యక్తులు ఆ ప్రాంతానికి వస్తే ఎందుకు వచ్చారో ఆరా తీస్తున్నారు. సుమారు ఇరవై రోజులుగా ఇసుక దందా సాగుతున్నా ఒక్క అధికారి కూడా కన్నెత్తి చూడలేదు. ఈ వ్యవహారాన్ని కొందరు స్థానికులు ఫొటోలు తీసి, అధికారుల వాట్సాప్‌కు పంపినా దందాను ఆపే ప్రయత్నం చేయలేదు. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో ఈ అక్రమ దందా జోరుగా సాగుతోంది. ఇసుకను నింపిన ట్రాక్టర్లు పోలీస్‌స్టేషన్ ముందు నుంచి వెళుతున్నా పట్టించుకున్న వారే కరువయ్యారు.

అనుమతుల్లేవు

దీనిపై తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావును వివరణ కోరగా.. బోడసకుర్రులో ఇసుక తీయడానికి ఎలాంటి అనుమతులు లేవన్నారు. స్థానిక వీఆర్వోలను అప్రమత్తం చేశామని, ఇసుకను తీస్తున్న వారిని గుర్తించి నోటీసులు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. ఎవరైనా నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుక తీస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

బాలికపై లైంగిక దాడి

కొవ్వూరు: బాలికను అత్యాచారం చేసిన యువకుడిపై బుధవారం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ విశ్వం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన బాలికను నాగరాజు అనే యువకుడు రెండేళ్లుగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. కాగా.. ఇంటి వద్ద బాలిక విచారంగా ఉండటాన్ని తల్లి గమనించింది. ఆమె ఆరా తీయగా మూడు రోజుల క్రితం ఈ ఘటన జరిగినట్టు బాలిక తెలిపింది. దీంతో ఆమె తల్లి బుధవారం పోలీసులను ఆశ్రయించింది. నాగరాజు తన కుమార్తెను భయపెట్టి అత్యాచారానికి పాల్పడ్డాడని ఫిర్యాదు చేసింది. గతంలో తాము ఇందిరమ్మ కాలనీలో ఉండే సమయంలో ఎదుటి ఇంటిలో నాగరాజు ఉండేవాడని వివరించింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. బాలికలను వైద్య పరీక్షల కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నాగరాజుపై పోక్సో కేసు నమోదు చేశారు.

గండేపల్లి: మురారి గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన వివాహితుడు ప్రేమపేరుతో మోసం చేశాడు. బాలిక ఫిర్యాదు మేరకు అతడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. నిందితుడిని కోర్టుకు తరలించగా 14 రోజులు రిమాండ్ విధించారన్నారు.

అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యక్తికి రిమాండ్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సోషల్ మీడియాలో కోచింగ్ సెంటర్‌పై అసభ్యకర, తప్పుడు పోస్టులు పెట్టిన వ్యక్తికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు. ఎస్పీ డి.నరసింహ కిశోర్ తెలిపిన వివరాల ప్రకారం .. రాజమహేంద్రవరంలోని కంబాలపేటకు చెందిన బి.రమేష్ 2015 నుంచి ఎస్‌వీఎస్ కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఈ సెంటర్ పరువుకు భంగం కలిగించేలా, విద్యార్థినుల ఫొటోలను మార్ఫింగ్ చేస్తూ ఓ వ్యక్తి అసభ్యకర పోస్టులు పెట్టేవాడు. దీనిపై రమేష్ ఈ ఏడాది ఏప్రిల్ 25న త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తుచేసి, విశాఖ జిల్లా కోతరుట్ల గ్రామానికి చెందిన దాసరి నాగేశ్వరరావును బుధవారం అరెస్టు చేశారు. అతడిని న్యాయమూర్తి ముందు హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాల క్రీడా సమాఖ్య పర్యవేక్షణలో నిర్వహించే 68వ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ అండర్-17 బాలికల పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ విషయాన్ని ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి, పోటీల నిర్వహణ కార్యదర్శి ఎల్.జార్జి బుధవారం తెలిపారు. కాకినాడ జిల్లా క్రీడామైదానంలో గురువారం నుంచి ఈ నెల 30 వరకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. 13 జిల్లాల నుంచి 210 మంది క్రీడాకారిణులు, 70 మంది కోచ్‌లు, మేనేజర్లు, పీడీలు హాజరవుతునట్లు వెల్లడించారు. ఈ మేరకు పోటీల నిర్వహణ ఏర్పాట్లను డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్, ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి జార్జితో కలిసి డీఈఓ రమేష్ బుధవారం పర్యవేక్షించారు.

మంచులింగం


రిఫ్రిజరేటర్‌లో లింగాకారంలో ఏర్పడిన మంచు

ముమ్మిడివరం: అమర్నాథ్‌లోని మంచులింగం తరహాలో ఏర్పడిన మంచుగడ్డను చూసి భక్తులు ఆశ్చర్యం చెందుతున్నారు. కార్తికమాసం కావడంతో శివ పరమాత్ముడు ఉద్భవించాడని పూజలు చేస్తున్నారు. ముమ్మిడివరం మండలం చినకొత్తలంకలోని పత్సమట్ల సుబ్రమ్మణ్యరాజు, సీతామహాలక్ష్మి దంపతుల ఇంట్లోని డీఫ్రిజ్‌లో మంచుగడ్డ ఏర్పడింది. ఇది అమర్నాథ్‌లోని మంచులింగం తరహాలో ఉంది. ఆ లింగాన్ని చూడటానికి ఆ ప్రాంత ప్రజలు తరలివస్తున్నారు.

క్రమశిక్షణతో సాధన చేస్తే విజయం ఖాయం

కలెక్టర్ ప్రశాంతి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే క్రమశిక్షణతో సాధన చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణ కోసం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలోని బీసీ స్టడీ సర్కిల్లో బుధవారం స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్లను కలెక్టర్ ప్రశాంతి, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ అధికారులతో కలిసి ఓపెన్ చేశారు. అనంతరం పరీక్ష నిర్వహణను పరిశీలించారు.

70 మంది హాజరు

కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రవేశ పరీక్షకు కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి 75 దరఖాస్తులు వచ్చాయి. బుధవారం జరిగిన పరీక్షలు 70 మంది హాజరయ్యారన్నారు. యూపీఎస్సీ సివిల్స్ కోసం ఉచిత కోచింగ్‌లో ప్రవేశానికి కామన్ స్క్రీనింగ్ టెస్ట్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గొల్లపూడి కేంద్రంలో ఆరు నెలలు వసతులతో కూడిన శిక్షణ అందిస్తారన్నారు. ఈ కాలంలో ఉపకార వేతనం కూడా మంజూరు చేస్తారని తెలిపారు. ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి, బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు కేఎస్ జ్యోతి, బీసీ సంక్షేమశాఖ అధికారి సత్య రమేష్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎం.సందీప్ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్యాయత్నం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ కుటుంబ ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని మల్లిన నగర్ సుధా రెసిడెన్సీలో పాతూరి ఉపేంద్ర కుమార్, అతడి భార్య విజయ, కుమారుడు సంతోష్ నివసిస్తున్నారు. ఉపేంద్ర కుమార్ మల్లిన నగర్‌లో ఎస్‌వీ ఫుడ్స్‌జోన్ పేరుతో హోటల్, కాఫీహౌస్ నిర్వహిస్తున్నారు. అయితే బుధవారం ఉదయం ఇంటిలో నుంచి ఎవరూ బయటకు రాకపోవడాన్ని స్థానికులు గమనించారు. అక్కడకు వెళ్లి చూడగా ఉపేంద్ర కుమార్, విజయ, సంతోష్ కింద పడి ఉన్నారు. కూల్‌డ్రింక్‌లో పురుగుమందు కలుపుకొని వారు తాగినట్లు గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే ఆ ముగ్గురిని చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పట్టభద్రుల ఓటు నమోదుకు గడువు పెంపు

- డిసెంబర్ 9 వరకూ పొడిగింపు
- మరిన్ని దరఖాస్తులు పెరిగే అవకాశం

దేవరపల్లి: ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు ప్రభుత్వం గడువును పొడిగించింది. అధికారుల ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 6వ తేదీతో గడువు ముగిసింది. పట్టభద్రులు ఓటు హక్కుకోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో చేసుకున్ని దరఖాస్తులను అధికారులు పరిశీలించి, అర్హత గల ఓటర్ల ముసాయిదా జాబితాను తయారు చేసి విడుదల చేశారు. అయితే అర్హత ఉండి అనేక కారణాల వల్ల ఓటు హక్కు నమోదుకు దరఖాస్తు చేసుకోలేదు. దీంతో వీరికి ప్రభుత్వం మరొక అవకాశం కల్పించి డిసెంబరు 9వ తేదీ వరకు గడువు ఇచ్చింది. అర్హత గల పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఇప్పటికే దరఖాస్తులు ఇచ్చి నమోదు చేయించుకున్న వారికి ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా సరి చేయించుకోవడంతో పాటు కొత్తగా ఓటు నమోదు చేయించుకోవచ్చు. కాగా.. ఈ ఎన్నికలకు సంబంధించి కొవ్వూరు రెవెన్యూ డివిజన్‌లోని మూడు నియోజకవర్గాల్లో 37 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో గోపాలపురం నియోజకవర్గంలో 10, కొవ్వూరులో 15, నిడదవోలులో 12 ఉన్నాయి. గోపాలపురం నియోజకవర్గంలో 5,845 మంది, నిడదవోలులో 7,520 మంది, కొవ్వూరులో 8,709 మంది ఓటు హక్కు పొందినట్టు రెవెన్యూ అధికారులు విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్కొన్నారు. ప్రస్తుతం గడువు పొడిగించినందున ఓటర్లు పెరుగుతారని అధికారులు అంచనా వేస్తున్నారు.


దానవాయిపేట తీరంలో సముద్ర అలలు

అలల ఉధృతి

తొండంగి: హిందూ మహాసముద్రంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో సముద్ర అలలు ఎగసిపడుతున్నాయి. మండలంలోని అద్దరిపేట, కొత్తచోడిపల్లిపేట, వాకదారిపేట, పెరుమాళ్లపురం, దానవాయిపేట గ్రామాల్లోని తీరాల్లో కెరటాల ఉధృతిదృతి ఎక్కువగా ఉంది. దీంతో మత్స్యకారులు తమ బోట్లు తీరానికి చేర్చారు. తుపాను నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే వేటకు వెళ్లినవారంతా తీరానికి చేరుకోవాలని సమాచారం అందించామన్నారు. కాగా తుపాను ప్రభావంతో మెట్ట ప్రాంతాల్లో చలిగాలులు, ఈదురగాలులు వీస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు బాగా తగ్గడంతో చలి తీవ్రతకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DISTANCE EDUCATION
■ ఓపెన్ టెన్త్, ఇంటర్ పన్ సిట్టింగ్, డిగ్రీ, పీజీ, సైన్స్ & ఆర్ట్స్, MBA, MCA అన్ని యూనివర్శిటీల పరీక్షలు మా కాకతీయ విద్యాసంస్థలు, కాకినాడ దగ్గరలోని గొల్లపాలెంలో జరుగును. 100% పాస్ గైడెన్స్. మా ఆఫీసులు: కాకినాడ, రాజమండ్రి, రావులపాలెం. ఫోన్: 98495 82043, 98494 82757 [V- 2727]

Real Estate

PLOT FOR SALE
■ Plot for Sale 253 SYD East Facing North East Corner 5km from Rajahmundry Airport located at Gummuluru. Price 7000 per SYD (Negotiable) Contact : 9985368343, 8247080754 [HA-06388]

SITE FOR SALE
■ కొవ్వూరులో ఏలూరు హైవేకి అనుకుని ఉన్న నార్త్ ఫేసింగ్ గల 200 చ॥ గ॥ స్థలం అమ్మకమునకు కలదు. ✆ : 9000 52 0036 [R-1260777]

TO-LET
■ రాజమండ్రి ప్రకాష్‌నగర్ రౌండ్‌పార్క్ దగ్గర 60 అడుగులు రోడ్డుకు చేర్చి 425 గజముల స్థలం అద్దెకు ఇవ్వబడును. హాస్పిటల్స్/షోరూమ్స్ అనుకూలం.సెల్ : 98492 42401 [C-800105]

Services
■ USA Australia Visit Visa to work converted available Chef's Nanny Hotel Servers available urgently 9640244456 [SCA24000701]

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2578]

Wanted
■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:- టెన్త్ to డిగ్రీ, Sal:- 20k-25k ఉచిత రూము, భోజనము సదుపాయం, వర్క్ ఫ్రంహోం అవకాశముంది. సం:9110475386 [G-9083]
■ బ్యాంకులలో జాబ్స్ కం॥ ఆపరేటర్స్, క్లర్క్స్, అటెండర్స్, అకౌంటెంట్స్, క్యాషియర్స్, రికవరీ. జీ: 25000/-. ✆ 9491685700 [G-9625]
■ కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ:15- 40 వేలు. ఫ్రీ రూం+ భోజనం. HYD. 9182260297 [HA-99097]
■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ : 18K. Ph: 9160900024, 9640400073 [HA-1385]
■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:- టెన్త్ to డిగ్రీ, Sal:- 20k-30k మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. సం:8121818692 [G-9087]
■ విజయవాడలో సంపన్నుల/ పెద్దవారి ఇళ్ళ వద్దే ఉండి, పేషెంట్లని / Bed Ridden వారిని చూసుకొనుటకు అనుభవం గల కేర్‌టేకర్స్, నర్సులు, ఆయాలు కావలెను. ✆ 9160835559, 9885025559 [B-374]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్: 0883-2483010

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సూర్యారావు పేట బ్రాంచి, మెయిన్ రోడ్ కాకినాడ.

స్థిరాస్తుల అమ్మకం కొరకు వేలం ప్రకటన
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని 8(6)ల నిబంధనలలో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం. 2002 ప్రకారం స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం నోటీసు)

ఇందుమూలముగా నోటీసు జారీచేస్తూ సాధారణ ప్రజానీకానికి మరియు "ఋణగ్రహీత(లు) & హామీదారు(లు)"లకు ప్రత్యేకముగా తెలుపునది ఏమనగా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యొక్క అధీకృత అధికారిచే లాంఛనంగా స్వాధీనం తీసుకొనబడిన బ్యాంక్ తనఖాలో/ ఛార్జీలో ఉన్న దిగువ పేర్కొన్న స్థిరాస్తిని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదారులు బకాయి పడిన దిగువ తెలిపిన బకాయిల మొత్తం+వడ్డీ,కాస్ట్స్,ఇతర ఖర్చులతో సహా వసూలు కొరకు "ఎక్కడ ఉన్నది అలాగే" "ఏది ఉంటే అది & ఎక్కడ ఏది ఉన్నదో అలాగే" పద్ధతిలో తేది: **13.12.2024** న అమ్మకం చేయుటకు నిర్ణయించినారు.

ఇ-వేలం తేది & సమయం: 13.12.2024, మ॥12.00 గం॥ నుండి సా॥05.00 గం॥ వరకు

ఋణగ్రహీత(లు): మెస్సర్స్ సతీష్ ఆటో లేక్ ,యజమాని : నాగిరెడ్డి సతీష్ రావు డి.నెం. 16-23-46/9ఎ, వల్లభరాజునగర్, వెస్ట్ రోడ్, వాటర్ ట్యాంక్ స్ట్రీట్, కాకినాడ – 533001.హామీదారు(లు): 1) శ్రీ నాగిరెడ్డి సతీష్ రావు డి.నెం. 16-23-46/9ఎ, వల్లభరాజునగర్, వెస్ట్ రోడ్, వాటర్ ట్యాంక్ స్ట్రీట్, కాకినాడ – 533001. 2) శ్రీమతి నాగిరెడ్డి విజయలక్ష్మి డి.నెం. 16-23-46/9ఎ, వల్లభరాజునగర్, వెస్ట్ రోడ్, వాటర్ ట్యాంక్ స్ట్రీట్, కాకినాడ – 533001. వారు చెల్లించవలసిన బకాయిమొత్తం 31.07.2024 నాటికి రూ.34,21,822.00 (అక్షరాల ముప్పై నాలుగు లక్షల ఇరవై ఒక్క వేల ఎనిమిది వందల ఇరవై రెండు రూపాయలు మాత్రమే)+ తదుపరి వడ్డీ, కాస్ట్ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి.

స్థిరాస్తుల వివరములు

తూర్పు గోదావరి జిల్లా (ప్రస్తుతము కాకినాడ జిల్లా), సర్పవరం యూనిట్, వాకలపూడి, బాలాజీనగర్, యుడిసి నెం.168/85, టి.యస్.నెం.184/1,184/21,184/6,184/10, 184/21, 184/23,184/2బి &184/32 నందు **శ్రీమతి నాగిరెడ్డి విజయలక్ష్మి** పేరునగల 300 చ॥గ॥ విస్తీర్ణముగల ప్లాట్ నెం.23 ఖాళీస్థలము/ రెసిడెన్షియల్ భవనమునకు సంబంధించిన యావదాస్తి. **ఈ దిగువ హద్దులలో : తూర్పు** : 45 అ॥- 33 అ॥ వెడల్పుగల రోడ్డు, **పడమర** : 45 అ॥-ప్లాట్ నెం.17 కలిగిన స్థలము, **ఉత్తరం** : 45 అ॥- ప్లాట్ నెం.22 కలిగిన స్థలము, **దక్షిణం** : 60 అ॥-ప్లాట్ నెం.24 కలిగిన స్థలము.

రిజర్వుధర: రూ.21,00,000/- ధరావత్తు: రిజర్వుధరలో 10% బిడ్ పెంపుదల: రూ.21,000/-

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)/రూల్ 9(1)ల ప్రకారం చట్టబద్ధమైన 30 రోజుల విక్రయ నోటీసు. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క 8(6)/రూల్9(1) క్రింద పై ఋణం తీసుకొన్న ఋణగ్రహీతలు మరియు హామీదారులకు పైన తెలిపిన తేదీన ఇ-వేలం జరుపబడుతుందని జారీ చేయబడుతున్న నోటీసుగా కూడా దీనిని పరిగణించాలి.

అమ్మకం యొక్క సవివరమైన, నియమ నిబంధనల కోసం ఈ వెబ్‌సైట్ https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx (or) www.unionbankofindia.co.in మరియు ఇ-వేలం పోర్టల్: వెబ్‌పోర్టల్: https://ebkray.in లో సందర్శించగలరు

తేది: 22.11.2024, ప్రదేశము: కాకినాడ సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా